ప్రజాశక్తి
శుక్రవారం 7 మార్చి 2025
5
విజయనగరం

కేంద్రీయ విద్యాలయంలో అడ్మిషన్లు ప్రారంభం

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని బాబామెట్టలోగల కేంద్రీయ విద్యాలయంలో బాల్వటిక-3, ఒకటవ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ లో దరఖాస్తులు ఈనెల 7 నుంచి 21వరకు స్వీకరిస్తారని ఆ విద్యాలయ ప్రిన్సిపాల్ దిలీప్‌మెహర్ తెలిపారు. బాల్వటిక–3, ఒకటో తరగతిలో ఉన్న 40 సీట్లకు గాను 8 సీట్లు చొప్పున ఆర్‌టిఇ చట్టం ప్రకారం రిజర్వు అయ్యాయని తెలిపారు. రెండో తరగతి, ఆపై తరగతులకు దరఖాస్తులను ఏప్రిల్ 2 ఉదయం 10గంటల నుంచి ఏప్రిల్ 11 సాయంత్రం 4గంటల వరకు ఆఫ్‌లైన్‌లో స్వీకరిస్తారని తెలిపారు. దరఖాస్తుకు Balvatika -3 : https://balvatika.kvs.gov.in, Class-I : https://kvsonlineadmission.kvs.gov.in, గైడ్‌లైన్స్ కోసం వెబ్‌సైట్ www.kvsangathan. nic.in/ en/admissionలో సంప్రదించాలని తెలిపారు.

వెటర్నరీ విద్యార్థులపై ప్రభుత్వం వివక్ష

వెటర్నరీ వైద్య కళాశాల విద్యార్థులపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని, వివక్షతను చూపుతోంది. ఇంటర్న్‌షిప్ పేరిట ఇస్తున్న పారితోషికం 13ఏళ్లగా పెంచకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమౌతున్నారు. రూ.7వేలతో ఎలా నెట్టుకు రావాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరి ఘోష ప్రభుత్వానికి మాత్రం పట్టడం లేదు.

కళాశాల వద్ద నిరాహారదీక్ష చేస్తున్న వెటర్నరీ వైద్య విద్యార్థులు

13ఏళ్లగా పెంచని ఇంటర్న్‌షిప్ స్టైఫండ్
రూ.7వేలతో ఎలా బతకాలంటూ నిరాహార దీక్షకు దిగిన విద్యార్థులు
పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/ చీపురుపల్లి

గరివిడిలోని శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ కళాశాలలో 327మంది విద్యార్థులు ఉన్నారు. వీరంతా ఎంబిబిఎస్ మెడిసిన్, డెంటల్ విద్యార్థులతో సమానంగానే 5 సంవత్సరాల ఆరు మాసాలపాటు యుజి (అండర్ గ్రాడ్యుయేట్) పూర్తి చేయాల్సివుంటుంది. ఇందులో చివరి సంవత్సరంలో ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ఈ కాల వ్యవధిలో ఏదైనా రెండు జిల్లాల్లో ప్రభుత్వ వెటర్నరీ ఆసుపత్రులు, పశు సంరక్షణా కేంద్రాలు లేదా జంత ప్రదర్శన శాలల్లో పని చేయాల్సివుంటుంది. అక్కడి వైద్యుల పర్యవేక్షణలో వీరంతా సేవలందిస్తారు. మిగిలిన వైద్యుల మాదిరిగా నగరాలు, పట్టణాల్లో ఉండేందుకు అవకాశం ఉండనే ఉండదు. పూర్తిగా గ్రామీణ ప్రాంతాల్లోనే సేవలు అందించాల్సిన పరిస్థితి ఉంటుంది. ఇంటర్న్‌షిప్ కాల వ్యవధిలో ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు, భోజనం, వసతి నిమిత్తం 13ఏళ్ల క్రితం అప్పటి ధరలు, ఛార్జీలను బట్టి ఇంటర్న్‌షిప్ రూ.7వేలుగా నిర్ణయించారు. నాటి నుంచి నేటి వరకు అనేక సార్లు ధరలు, ఛార్జీలు, వసతి అద్దెలు పెరిగినా అందుకు అనుగుణంగా స్టయిఫండ్ పెంచలేదు. మనకన్నా అత్యంత వెనుకబడి ఉందన్న ఒడిశా రాష్ట్రంలో ప్రస్తుతం రూ.14వేల చొప్పున ఇంటర్న్‌షిప్ చెల్లిస్తున్నారు. అత్యంత చిన్న రాష్ట్రమైన కేరళలో రూ.17వేలు, పొరుగు రాష్ట్రం తమిళనాడులో రూ.18వేలు, రాజస్థాన్‌లో 23వేల చొప్పున చెల్లిస్తున్నారు. వాటి మాదిరిగా పెరిగిన ధరలు, ఛార్జీలు, అద్దెలను బట్టి మెడికల్ విద్యార్థులతో సమానంగా రూ.25వేలు చెల్లించాలని ఇక్కడి వెటర్నరీ విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

దీనికితోడు 2020లో కళాశాలలో చేరిన బ్యాచ్‌కి ఇప్పటికే తరగతులు పూర్తయ్యాయి. త్వరలో ఇంటర్న్‌షిప్‌కు వెళ్లనున్నారు. ఇప్పటికీ కళాశాలకు వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి గుర్తింపు రాకపోవడంతో విద్యార్థుల్లో కళవరం మొదలైంది. వర్శిటీ యాజమాన్యం తమ కళాశాల స్థాయికి తగ్గట్టు మౌలిక సదుపాయాలు, నియామకాలు చేపట్టకపోవడం వల్ల గుర్తింపు విషయంలో జాప్యం జరుగుతోందని, ఇదే పరిస్థితి కొనసాగితే ఇంటర్న్‌షిప్ పూర్తిచేశాక తమ జీవితాలు అగమ్యగోచరంగా మారుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కళాశాల లేదా వర్శిటీ నుంచి సర్టిఫికేట్లు లేకపోతే తమకు ఉద్యోగాలు ఎవరు ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో తమ సమస్యల పరిష్కారానికి ఫిబ్రవరి 3వ తేదీ నుంచి కళాశాల ఎదుట నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టారు. మంత్రులకు, ఎమ్మెల్యేలకు సమస్యలను విన్నవించినా ప్రభుత్వం, వర్శిటీ యాజమాన్యం పట్టించుకోలేదు సరికదా అణిచివేతకు పాల్పడింది. విద్యార్థులు ఆందోళన విరమించకపోతే ఈనెల 5వ తేదీ నుంచి మెస్ మూసివేయాలంటూ కళాశాల యాజమాన్యానికి సర్కులర్ పంపారు. ఇందుకు విద్యార్థులు వెరవలేదు. తాడోపేడో అంటూ వంటావార్పు కార్యక్రమాన్ని కూడా చేపట్టి నిరసన మరింత తీవ్రతరం చేశారు. దీంతో, దిగివచ్చిన యాజమాన్యం మెస్ మూసివేత ఆదేశాలను వెనక్కి తీసుకుంది.

సమస్య పరిష్కారమయ్యే వరకూ పోరాటం

ఇంటర్న్‌షిప్ పేరిట సంవత్సరంపాటు పనిచేయాలంటే రూ.7వేలు ఎలా సరిపోతాయి. ఎంబిబిఎస్, డెంటల్ విద్యార్థుల మాదిరిగానే మేము కూడా ఐదున్నరేళ్లు చదువుతున్నాం. చివరికి కళాశాలకు గుర్తింపు లేదంటే స్నేహితులు, బంధువులకు ఏమని చెప్పుకోవాలి. తమ సమస్యలు పరిష్కారం చేసేవరకు పోరాటం కొనసాగిస్తాం.

వి.కీర్తి, వెటర్నరీ కళాశాల ఐదో సంవత్సరం విద్యార్థి

యాజమాన్యం దృష్టికి ఇంటర్న్‌షిప్ సమస్య

తమ ఇంటర్న్‌షిప్ సమస్య తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ వర్శిటీ యాజమాన్యం దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లాం. అది పూర్తిగా యాజమాన్యం, ప్రభుత్వం పరిధిలో ఉంటుంది. మెస్ మూసివేత ఆదేశాలను యాజమాన్యం వెనక్కి తీసుకుంది. వెంటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు విషయంలో విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇంటర్న్‌షిప్ పూర్తికాగానే గుర్తింపు వస్తుంది. విసిఐ గుర్తింపు అనేది ఇంటర్న్‌షిప్ తొలి బ్యాచ్ ముగింపుతో ముడిపడి ఉంటుంది.

ఎం.శ్రీను, అసోసియేట్ డీన్
శ్రీ వెంకటేశ్వర వెంటర్నరీ కళాశాల, గరివిడి

పవన్ కల్యాణ్ మాట నిలబెట్టుకోలేదు

డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదు. ఎన్నికలకు ముందుకు యువకులంతా సహకరించాలన్నారు. గెలిపిస్తే ఇంటర్న్‌షిప్ పెంచేందుకు కృషి చేస్తానని చెప్పారు. తీరా గెలిచిన తరువాత నెల రోజుల క్రితం గన్నవరం ఎయిర్‌పోర్టులో తమ గోడు వినకుండా వెళ్లిపోయారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్య పరిష్కరించాలి. లేదంటే తమ ఆందోళన మరింత ఉధృతం చేస్తాం.

దాసరి లోకేష్, గరివిడి వెటర్నరీ కళాశాల
ఎపి వెంటర్నరీ అండర్ గ్రాడ్యుయేట్ స్టూడెంట్స్ అసోసియేషన్

రేపటి నుంచి సిపిఎం ప్రజా చైతన్యయాత్ర

జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

చైతన్యయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో ఈనెల 8నుంచి 17 వరకు సిపిఎం ఆధ్వర్యాన ప్రజా చైతన్యయాత్రలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ తెలిపారు. గురువారం స్థానిక ఎల్‌బిజి భవనంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారాన్ని చేపట్టి 8 నెలలు గడిచినా ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించలేదన్నారు. అనేక సమస్యలతో ప్రజలు అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని అన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం ప్రజా సమస్యలపై స్పందిస్తుందేమోనని ఎదురుచూసామని అన్నారు. కానీ దీనికి భిన్నంగా కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని అన్నారు. ఎన్నికల్లో అధికారం లోకి వచ్చిన మరుక్షణమే హామీలను అమలు చేయడానికి పూనుకుంటామని చెప్పి నేటి వరకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేదని అన్నారు. ఇటీవల చేసిన బడ్జెట్ కేటాయింపుల్లో కూడా ఈ పథకాలు అమలుకు నిధులు కేటాయించలేదని అన్నారు. ప్రజలు రోడ్ల సమస్య, భూ సమస్య, ఇళ్ల సమస్య, రైతులు వ్యవసాయానికి సంబధించిన సమస్యలు ఈ విధంగా చెప్పుకుంటూ పోతే అన్ని తరగతుల ప్రజానీకం వివిధ రకాల సమస్యలతో సతమతమవుతున్నారని అన్నారు. ఈ సమస్యలన్నింటినీ ప్రజలు వద్దకు వెళ్లి తెలుసుకొని వాటి పరిష్కారానికి వివిధ రూపాల్లో ఉద్యమాలు చేపడతామన్నారు. ఈ యాత్రలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఎప్పటికైనా ప్రభుత్వం ప్రజాసమస్యలు పరిష్కారానికి, ఇచ్చిన హామీలు అమలుకు పూనుకోవాలని లేని యెడల ప్రజా పోరాటాలకు సమాధానం చెప్పాల్సి ఉంటుందని అన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.లక్ష్మి పాల్గొన్నారు.

పోలవరం కాలువ భూసేకరణ ప్రారంభించాలి

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టులో భాగంగా జిల్లాలో పోలవరం ప్రధాన కాల్వ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రెవిన్యూ అధికారులను ఆదేశించారు. ప్రధాన కాల్వ నిర్మాణంలో భాగంగా ముందుగా ఏ ప్రాంతాల్లో పనులు ప్రారంభిస్తారో ఆయా గ్రామాల వివరాలు జలవనరుల శాఖ అందజేస్తే ఆ గ్రామాల్లో ముందుగా భూసేకరణ ప్రక్రియ చేపట్టి పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లాలోని మూడు భూసేకరణ యూనిట్ల ఆధ్వర్యంలో శుక్రవారం నుంచే తమకు అప్పగించిన మేరకు భూసేకరణ ప్రక్రియ ప్రారంభించాలని ఆయా భూసేకరణ అధికారులు, సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. పోలవరం ప్రధాన కాల్వ భూసేకరణపై జిల్లా కలెక్టర్ గురువారం తన ఛాంబరులో జలవనరుల శాఖ, భూసేకరణ అధికారులతో సమీక్షించారు. అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములకు కూడా మార్కెట్ విలువ మేరకు ధరలను లెక్కించి అంచనాలు ఇవ్వాలన్నారు. 59 గ్రామాల్లో 3,314 ఎకరాల భూములు అవసరమని గతంలో జలవనరుల శాఖ గతంలో ప్రతిపాదనలు పంపించిందని, తాజాగా ఏప్రిల్ 1 నాటికి వున్న భూముల ధరల ప్రకారం భూసేకరణకు అయ్యే వ్యయాన్ని అంచనాలు వేయాలని తెలిపారు. జలవనరుల శాఖ భూసేకరణకు అవసరమైన నిధులను డిపాజిట్ చేసేలోగా అవార్డు పాస్ చేసే దశ వరకు భూసేకరణ ప్రక్రియ పూర్తిచేయాలని చెప్పారు. జలవనరుల శాఖ నుంచి ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా అందే అభ్యర్థనల మేరకు ఆయా గ్రామాల్లో భూసేకరణ పూర్తిచేయాలన్నారు. జలవనరుల శాఖ నుంచి భూసేకరణకు అవసరమైన నిధులను వెంటనే డిపాజిట్ చేస్తే తదుపరి ప్రక్రియ వేగవంతం చేస్తామన్నారు. భూసేకరణ అధికారుల నియామకం, యూనిట్లలో అవసరమై సిబ్బంది నియామకం చేపట్టనున్నట్టు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు ఇఇ ఉమేష్‌చంద్ర కుమార్, భూసేకరణ అధికారి నూకరాజు, ప్రధాన కాల్వ నిర్మాణ సంస్థ ప్రతినిధి లక్ష్మణ ప్రసాద్, డిఎఒ పైడిరాజు, కలెక్టరేట్ విభాగ అధికారులు శ్రీకాంత్, సూర్యలక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్లు పాల్గొన్నారు.

పశు వైద్య విద్యార్థుల పోరాటానికి అండగా ఉంటాం : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గరివిడి వెంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, వారికిచ్చే స్టయిఫండ్‌ను పెంచాలని కోరుతూ నెల రోజులుగా ఆందోళన చేస్తున్న విద్యార్థులకు అండగా ఉంటామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్ తెలిపారు. వారి పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. గురువారం ఎల్‌బిజి భవనంలో వారు విలేకర్లతో మాట్లాడారు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వాల నిర్లక్ష్యాల ఫలితంగా వెటర్నరీ విద్యార్థులు రోడ్డు పాలయ్యారని విమర్శించారు. అన్ని ఆరోగ్య సంబంధిత విద్యారంగాల్లో ఇంటర్న్ పీజీలు, పిహెచ్‌డి విద్యార్థులకు రూ.25 వేల నుంచి రూ.65 వేల వరకు స్టయిఫండ్ ఇస్తున్నారని, కానీ వెటర్నరీ విద్యార్థులకు మాత్రం కేవలం రూ.7వేలు మాత్రమే ఇస్తున్నారని అన్నారు. పశువైద్య విద్యార్థులకు కూడా అధిక మొత్తంలో స్టయిఫండ్ ఇచ్చి వారి విద్యకు తోడ్పడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి ఈ సమస్య పరిష్కారం అయ్యే విధంగా కృషి చేయాలని కోరారు. లేదంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని తెలిపారు.

నెలాఖరులోగా వక్ఫ్ ఆస్తుల సర్వే : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలోని వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, దీనిలో భాగంగా ఈ నెలాఖరులోగా స్థలాల సర్వేను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. జిల్లా స్థాయి వక్ఫ్ పరిరక్షణ కమిటీ సమావేశం కలెక్టర్ ఛాంబర్‌లో గురువారం నిర్వహించారు. వక్ఫ్ స్థలాల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ, వక్ఫ్ స్థలాలు అన్యాక్రాంతం అవ్వకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. జిల్లాలో మైనారిటీ సంక్షేమశాఖ రికార్డుల ప్రకారం మొత్తం 96 వక్ఫ్ స్థలాలను గుర్తించడం జరిగిందని చెప్పారు. మొత్తం ఆ స్థలాల వివరాలను వెంటనే సంబంధిత ఆర్‌డిఓలు, మున్సిపల్ కమిషనర్లకు అందజేయాలని వక్ఫ్, మైనారిటీ శాఖాధికారులకు సూచించారు. అలాగే ఇవే కాకుండా రెవెన్యూ, టౌన్ రికార్డుల్లో ఉన్న మొత్తం వక్ఫ్ స్థలాల వివరాలను సేకరించి, వాటిని సర్వే చేసి, నమూనా పటాలతో సహా ఈ నెలాఖరుకి అందజేయాలని ఆదేశించారు. డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒలు డి.కీర్తి, సత్యవాణి, మున్సిపల్ కమిషనర్లు పి.నల్లనయ్య, జె.రామప్పల నాయుడు, రామలక్ష్మి, అప్పలరాజు, జిల్లా మైనారిటీ అధికారి ఆర్ ఎస్ జాన్, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ షాహి షేక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

8న కబడ్డీ జట్లు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 14 నుంచి 16 వరకు కడప జిల్లాలో జరగబోయే రాష్ట్ర స్థాయి సబ్– జూనియర్ బాల, బాలికల ఉమ్మడి కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీలో పాల్గొనే విజయనగరం జిల్లా సబ్ జూనియర్ బాల, బాలికల జట్లు ఎంపిక ఈనెల 8న మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక సిటీ క్లబ్ ఆవరణలో జరుగుతుందని జిల్లా కబడ్డీ సంఘ ఛైర్మన్ ఐవిపి రాజు, అధ్యక్షులు రంగారావుదొర, కార్యదర్శి కెవి ప్రభావతి తెలిపారు. ఎంపికలో పాల్గొనదలచిన క్రీడాకారులు 16ఏళ్ల లోపు ఉండాలని (వయస్సు 30.3-2009 తేదీ తర్వాత పుట్టిన వారై వుండాలి) తెలిపారు. వివరాలకు - 9949721949 సంప్రదించాలని తెలిపారు.

గణిత పరీక్షకు 999 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో గురువారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం లెక్కలు పరీక్షకు 999 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 23,044 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా వారిలో 22045 మంది హాజరయ్యారని ఆర్‌ఐఒ ఎం.ఆదినారాయణ తెలిపారు. ప్రశాంతంగా పరీక్ష జరిగిందని పేర్కొన్నారు

గీత కార్మికులకు మద్యం షాపులు కేటాయింపు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు కేటాయించిన 16 మద్యం షాపులను ఎక్సైజ్ అధికారులు గురువారం లాటరీ ద్వారా కేటాయించారు. మొత్తం 16 షాపులకు 308 మంది దరఖాస్తు చేసుకోగా, డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి సమక్షంలో లాటరీ తీశారు. 308 దరఖాస్తుదారుల నుంచి ప్రభుత్వానికి రూ.6.16కోట్ల ఆదాయం వచ్చింది. అలాగే లాటరీలో షాపులు దక్కించుకున్న వారు మొదటి విడత లైసెన్సు ఫీజు రూ.84లక్షల 50వేల 60 రూపాయలు ఆదాయం ప్రభుత్వానికి సమకూరిందని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.శ్రీనాధుడు తెలిపారు. లాటరీ కార్యక్రమంలో జిల్లాలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్లంతా పాల్గొన్నారు.

వ్యాయామ విద్య అభివృద్ధికి కృషి చేయండి : డిఇఒ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిఇఒను కలిసిన వ్యాయామ ఉపాధ్యాయులు

జిల్లాలో వ్యాయామ విద్యాభివద్ధికి వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలని డిఇఒ యు.మాణిక్యంనాయుడు కోరారు. ఇటీవల జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు సంఘం నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన జి.లక్ష్మణ రావు, ఎన్.వెంకటనాయుడును డిఇఒ అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో విద్యాభివృద్ధికి, క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేసే విధంగా కృషి చేయాలని కోరారు. క్రీడలతోనే విద్యార్థులు మానసిక వికాసం పొందుతారని, ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు ఎల్ వి.రమణ, సూర్యారావు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందిస్తాం

ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డివిజి శంకర్రావు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఆస్పత్రిలో చిన్నారిని ఎత్తుకున్న డివిజి శంకర్రావు

గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, వాటిని త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డివిజి శంకర్ అన్నారు. మండలంలోని దారపర్తి పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాలకు చెందిన చిన్నారులు, వృద్ధులకు జ్వరాలు దద్దుర్లతో అవస్థలు పడుతూ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. వారిని గురువారం ఆయన పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ జ్వర పీడితులకు వైద్యాధికారులు వైద్య సేవలు అందించుటలో చొరవ తీసుకొని గిరిజన గ్రామాలలో ఉండి వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ రకం వ్యాధులకు కారణం ఏంటో పరిశీలించి వైద్యం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి పి-4 సర్వే

ప్రజాశక్తి-విజయనగరం

పబ్లిక్ ప్రైవేటు పీపుల్స్ పార్టిసిపేషన్ (పి–4) సర్వే ఈనెల 8 నుండి 18 వరకు జరుగుతుందని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. సచివాలయ సిబ్బంది, గ్రామస్థాయిలో పని చేసే సిబ్బంది ఈ సర్వేలో పాల్గొంటారని తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో సిపిఒ ఆధ్వర్యాన పి–4 సర్వే పై ఎంపిడిఒలకు, మున్సిపల్ కమీషనర్లకు , మండల ప్రత్యేకాధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర సాధనకు జీరో పేదరికం లక్ష్యంలో భాగంగా ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపడుతోందని తెలిపారు. సర్వే ద్వారా పేదలను గుర్తించి అవసరమగు తోడ్పాటు నందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 21 నుండి 22 మధ్య గ్రామ సభలను నిర్వహించాలని తెలిపారు. 27 వ తేదీన తుది నివేదిక నివ్వాలని తెలిపారు. సిపిఒ బాలాజీ మాట్లాడుతూ సర్వేలో కొన్ని గృహ యజమానిని అడగాలని, కొన్ని అక్కడ కనపడే పరిస్థితుల్ని బట్టి చూసి రాసుకోవాలని తెలిపారు. సమావేశంలో డిఆర్ఒ శ్రీనివాస మూర్తి, మండల ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఇటీవల మరణించిన హోంగార్డు వి.వెంకటరావు కుటుంబానికి మిగతా హోంగార్డులంతా చేయూతగా అందించిన ఆర్థిక సాయం రూ.3,24,470ను ఎస్‌పి వకుల్ జిందాల్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీసుశాఖలో పని చేస్తూ ప్రమాదవసాత్తు లేదా ఆకస్మికంగా లేదా అనారోగ్యంతో మరణించిన హోంగార్డు కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు హోంగార్డులంతా స్వచ్ఛందంగా ఒక రోజు డ్యూటీ అలవెన్సు చేయూతగా అందిస్తారని తెలిపారు. అందులో భాగంగానే వెంకటరావు సతీమణి సత్యవతికి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, హోంగార్డుల ఇన్‌చార్జ్ ఆర్ఐ ఆర్.రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

ఈనెల 8న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి పిలుపునిచ్చారు. రాజీ పడదగిన క్రిమినల్ కేసులను, మోటార్ ప్రమాద బీమా కేసులు, బ్యాంకు కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, మనీ కేసులు, ప్రామిసరీ నోట్ కేసులు, ఎలక్ట్రిసిటీ కేసులు, ఎక్సైజ్ కేసులు, ల్యాండ్ కేసులు, కుటుంబ తగాదాలు వాటర్ కేసులు, మున్సిపాలిటీ కేసులు ఇరు పార్టీల అనుమతితో రాజీ మార్గంలో శాశ్వత పరిస్కారం చేసుకోవచ్చుని తెలిపారు. కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు

సమాన పనికి సమాన వేతనమివ్వాలి

శ్రామిక మహిళా రాష్ట్ర నాయకులు ఉమామహేశ్వరి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమావేశంలో మాట్లాడుతున్న ఎం.ఉమామహేశ్వరి

మహిళలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీల వేయాలని శ్రామిక మహిళా రాష్ట్ర నాయకులు ఎం.ఉమామహేశ్వరి అన్నారు. మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎల్‌బిసి భవన్‌లో టి.లక్ష్మి అధ్యక్షతన గురువారం సదస్సు జరిగింది. ముఖ్యవక్తగా హాజరైన ఉమామహేశ్వరి మాట్లాడుతూ మహిళా దినోత్సవం రోజున గొప్పగా మాట్లాడుతున్న ప్రభుత్వ పెద్దలు, మహిళల ఆదాయాలను పెంచడంలో, వారికి రక్షణ కల్పించడంలో పూర్తిగా విఫలమవుతున్నారని అన్నారు. పురుషాధిక్యత గల సమాజంలో మహిళలు ద్వితీయ శ్రేణి పౌరులుగానే మిగిలిపోతున్నారని, దీన్ని అధిగమించేందుకు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో మహిళల్ని ప్రోత్సహించాలని అన్నారు. ప్రభుత్వమే మహిళల శ్రమను దోచుకుంటుందని, వివిధ ప్రభుత్వ స్కీముల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజనం, ఆశా, అంగన్వాడీ, విఒఎ, ఆర్‌పిలకు ఇస్తున్న వేతనాలే అందుకు నిదర్శనమని అన్నారు. మరి ఘోరంగా మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.3వేలు చెల్లిస్తే ఏ విధంగా జీవిస్తారని ప్రశ్నించారు. నిజంగా పాలకులకు చిత్తశుద్ధి ఉంటే వివిధ ప్రభుత్వ పథకాల్లో, స్కీముల్లో పనిచేస్తున్న మహిళలందరికీ కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐసిడిఎస్‌ను బలోపేతం చేసి బడ్జెట్లో కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. అత్యాచారాల నిరోధానికి పటిష్ట చట్టం చేయాలని, మద్యం డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమతా రాష్ట్ర కన్వీనర్ జి. నిర్మల మాట్లాడుతూ కులం మతం , జండర్ , జాతి పేరుతో నిరంతరం దేశాన్ని రావణ కాష్టం చేస్తున్న బిజెపి ప్రభుత్వం మహిళల ప్రజాస్వామ్య హక్కులను హరిస్తుందని అన్నారు. మహిళలపై అత్యాచారాలు బిజెపి పాలిత రాష్ట్రాల్లోనే అధికంగా జరుగుతున్నాయని అందుకు వారు అనుసరిస్తున్న మనువాద సిద్ధాంతమే కారణమన్నారు. సదస్సులో సిఐటియు నగర అధ్యక్షుడు ఎ.జగన్మోహన్రావు, శ్రామిక మహిళా నాయకులు విశాలాక్షి, నందిని, సంతు, స్వప్న, పార్వతీ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఎపిసి రామారావుకు పేటెంట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్ట్ సమన్వయకర్త డాక్టర్ ఎ.రామారావుకు కేంద్ర ప్రభుత్వం నుంచి పేటెంట్ దక్కింది. ' ఇంటెలెక్యువల్ ప్రాపర్టీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా పాలిమర్ ఫుల్లీ డ్రైవెన్ సెంట్రీఫీగల్ పంప్'పై ఆయన చేసిన పరిశోధనకు గాను ఆయనకు పేటెంట్ లభించింది. ఈమేరకు తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వెల్లడించారు. ఈనెల 4న ఈ పేటెంట్ హక్కు సర్టిఫికెట్ అందుకున్నట్లు తెలిపారు. ఎన్‌టిఆర్ అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ యూనివర్శిటీలో 2013లో పిహెచ్‌డిలో ప్రవేశం పొందానని, 2014 నుంచి 2017 వరకు పిహెచ్‌డి రీసెర్చ్ కోసం డిజైన్, డెవలప్మెంట్, పెర్ఫార్మన్స్ ఎవాల్యుషన్ ఆఫ్ పాలిమర్ కాస్టెడ్ సెంట్రి ఫిగల్ పంప్స్ అనే అంశంపై పరిశోధన చేశానని తెలిపారు. ఇందుకు సంబంధించి 20ఏళ్లకు గాను తనకు పేటెంట్ దక్కిందన్నారు. పేటెంట్ రావడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

కుట్టు మిషన్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-విజయగనరంకోట

రాష్ట్రంలోని బిసి కార్పొరేషన్, కాపు కార్పొరేషన్, ఇబిసి, కమ్మ, రెడ్డి, ఆర్య వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్లకు సంబంధించిన మహిళా లబ్ధిదారులకు బిసి కార్పొరేషన్ ద్వారా కుట్టు మిషన్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం కార్యనిర్వాహక సంచాలకులు తెలిపారు. దరఖాస్తుదారులు AP-OBMMS ద్వారా వారి పేరును ఆన్‌లైన్‌లో ఈనెల 7 నుంచి నమోదు చేసుకోవాలని తెలిపారు. ఎంపికైన లబ్దిదారులకు శిక్షణ అనంతరం 75శాతం పైగా హాజరు కలిగిన వారికి సర్టిఫికెట్, ఉచితంగా కుట్టుమిషన్ అందజేస్తారని తెలిపారు. 18 నుంచి 50ఏళ్ల మధ్య వయసు, తెల్ల రేషన్ కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు కలిగి ఉండాలని తెలిపారు. https://apobmms.apcfss.in వెబ్ సైట్ (ఆన్ లైన్)లో సంబంధిత సచివాలయం, ఎంపిడిఒ, మున్సిపల్ కార్యాలయంలో పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.

నిధులు మంజూరు చేయండి

ప్రజాశక్తి - బొబ్బిలి

మున్సిపాలిటీలో మౌలిక సౌకర్యాలు కల్పనకు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. అమరావతిలో గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో మున్సిపాలిటీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. మున్సిపాలిటీలో ఇరుకు రోడ్లుతో వాహనదారులు, వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యా సంస్థలు విడిచిపెట్టే సమయంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుందన్నారు. రోడ్ల విస్తరణకు నిధులు మంజూరు చేయాలని కోరారు. నాయుడు కాలనీ, ఇందిరమ్మ కాలనీ, సాయి సర్వాణి, నూతన కాలనీలలో మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మౌలిక సౌకర్యాలు కల్పనకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ

ప్రజాశక్తి- రేగిడి

స్థానిక భవిత కేంద్రంలో గురువారం వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ సేవలను ఆర్థోపెటిక్ వైద్యులు డాక్టర్ రమాచంద్రిక అందించారు. ఈ ఫిజియోథెరపీని ఎంఇఒ ఎం.వరప్రసాదరావు, ఎరకయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిజియోథెరపీ సేవలు విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. వైద్యులు సలహాలు మేరకు ఇంటి వద్ద విద్యార్థులకు ఫిజియోథెరపీని రెండుపూటలా తల్లిదండ్రులు చేయించాలన్నారు. ఐఇఆర్‌టియు మహేశ్వరి, రాజేష్, ఎమ్మార్సీ సిబ్బంది ఉన్నారు.

ఉపాధి పనుల వద్ద సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని వావిలవలస పంచాయతీలో అయ్యవారి చెరువు పనుల వద్ద వేతన దారులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఎపిఒ సంకా బత్తుల హరినాథ్ అన్నారు. ఈ మేరకు గురువారం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి, కూలి గిట్టిబాటుపై అవగాహన కల్పించారు. చెరువు పనులలో 163 మంది వేతనదారులు మస్టర్స్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పనులు వద్ద సౌకర్యాలు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. తాగునీరు, వేసవి ఎండలకు టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. కొలతల ప్రకారం పనులు చేస్తే రూ, 300 కూలి గిట్టుబాటు అవుతుందన్నారు. మేట్లు ఎంఎంఎస్ యాప్‌లో మస్టర్లు అప్లోడ్ చేయాలని అన్నారు.

పిఠాపురంలో జనసేన ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి - కొత్తవలస

పశ్చిమ గోదావరి జిల్లా పిఠాపురం నియోజకవరగం చిత్రాడలో జగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జనసేన పార్టీ నియోజకవర్గం ఇంచార్జ్ వబ్బిన సత్యనారాయణ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నాయకులు, యువతతో కలిసి ఆయన ఛలో పిఠాపురం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 14న పిఠాపురం చిత్రాడలో జరగనున్న జనసేన 12వ ఆవిర్భావ సభ చరిత్రలో నిలిచిపోతుందని, జనసేనపార్టీ ఆవిర్భావం నుండి అభివృద్ధి వరకు తోడు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ వేడుకల్లో పాల్గొని ఆవిర్భావ దినోత్సవ వేడుకలు విజయవంతం చెయ్యాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పిల్లా రామదుర్గ, జనసేన మండల అధ్యక్షులు గాలి అప్పారావు, జిల్లా ప్రచార కార్యదర్శి మల్లువలస శ్రీను, మండల ప్రధాన కార్యదర్శిలు రాందాస్ కాశీ, బంధం సత్యనారాయణ, కార్యదర్శి అంగి కోటీశ్వరావు, జిన్నాల శ్రీను, గొంప అప్పలనాయుడు, నాగేష్ జనసైనికులు,యువత పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణకు గడువు పెంపు

ప్రజాశక్తి- వేపాడ

గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్మీడియేట్ ఫస్టియర్ ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ గడువును మార్చి 13 వరకు పొడిగించారని స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ యు ఉషారాణి తెలిపారు. గతంలో విధించిన గడువు గురువారంతో ముగుస్తున్న నేపథ్యంలో ఈ నెల 13వ తేదీ వరకు గడువు పెంచారని చెప్పారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. http//apbragcet.apcfss.in ద్వారా ఆన్లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు.

ట్రైసైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కృష్ణరాయుడుపేట గ్రామానికి చెందిన అన్నా చెల్లెల్లు హేమకుమార్, ఉతకాషి ఇద్దరూ పూర్తిగా శారీరక వైకల్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న టిడిపి నాయకులు గొంప కృష్ణ వారికి గురువారం ట్రైసైకిళ్లను అందించారు. అన్నా చెల్లెల్లు ఇద్దరూ కదలలేని పరిస్థితిని చూసిన కృష్ణ గతంలో వారిద్దరికీ ట్రైసైకిళ్ల ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు శ్రీ సత్యసాయి దివ్యామృతం, గురుదేవా చారిటబుల్ ట్రస్టల సహకారంతో వారిద్దరికీ రెండు ట్రైసైకిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, గొంప సూర్యనారాయణ, గొంప అప్పల నాయుడు, ఇసరపు రమణ, గొంప కుమార్, వంటాకు సముద్రంనాయుడు, ఇసరపు హేమంత్ కుమార్, యంద్రపు ఈశ్వరావు, చెల్లిబోని రామకృష్ణ, పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరండి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గల హైస్కూల్ ప్లస్ ఫర్ గర్ల్స్ (బాలికల జూనియర్ కళాశాల)లో బాలికలు అందరూ చేరాలని ధర్మవరం హైస్కూల్ ప్లస్ అధ్యాపకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌కోటలో గల జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినిలతో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ బి నర్సింగరావు మాట్లాడుతూ ధర్మవరం హైస్కూల్ ప్లస్ ఫర్ గర్ల్స్‌లో నాణ్యమైన ఉచిత విద్య, ప్రభుత్వం అందించే మధ్యాహ్న భోజన పథకం, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగు, తదితర ప్రభుత్వ సదుపాయాలన్నీ ఉన్నాయన్నారు. అనుభవజ్ఞులైన పిజిటి అధ్యాపకుల విద్యాబోధన తోపాటు ప్రభుత్వం కల్పించే సకల సదుపాయాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం టి.విజయలక్ష్మి, ధర్మవరం బాలికల జూనియర్ కళాశాల పిజిటి అధ్యాపకులు పి.శివాజీ, రహీం షేక్ లాల్, తమ్మినాన రాజేష్, ఎస్వీఎస్ఎన్ మూర్తి, అరసాడ సురేంద్రనాథ్, చింతాడ కృష్ణంరాజు, బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు పి స్వప్న, భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని తిమిడి గ్రామం ఉపాధి హామీ కూలీలకు 6 వారాల నుండి ఉన్న బకాయిలను కూలీలకు చెల్లించాలని జనసేన పార్టీ నియోజకవర్గ నాయకుడు వబ్బిన సన్యాసినాయుడు కోరారు. గురువారం ఉపాధి కూలీల విజ్ఞప్తి మేరకు తిమిడిలో జరుగుతున్న ఉపాధిహామీ మట్టి రోడ్ పనులు పరిశీలించారు. ఆరు వారాలుగా తమకు కూలీ డబ్బులు ఇవ్వలేదని కూలీలు చెప్పడంతో ఆయన వెంటనే స్పందించి ఎపిఒ రమ్యను సంప్రదించిన ఉపాధి కూలీల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఎపిఒ రమ్య మాట్లాడుతూ కార్డ్ నుండి క్రెడిట్ అవ్వలేదని 10వ తేదిలోపు సమస్యను పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారని సన్యాసినాయుడు తెలిపారు.

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డిఎస్‌పి

ప్రజాశక్తి - వంగర

స్థానిక పోలీస్ స్టేషన్‌ను చీపురుపల్లి డిఎస్‌పి ఎస్ రాఘవులు గురువారం సందర్శించారు. ఈ మేరకు ఎస్ఐ షేక్ శంకర్‌తో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో మాట్లాడి సూచనలు ఇచ్చారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజాం రూరల్ సీఐ హెచ్ ఉపేంద్రరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

ప్రజాశక్తి - రామభద్రపురం

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు చేస్తున్నామని పరీక్ష పత్రాలు స్థానిక పోలీసు స్టేషనులో భద్ర పరిచామని ఎంఇఒ తిరుమలప్రసాద్ తెలిపారు. ఈ నెల 17వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు మండలంలో వివిధ పాఠశాలల నుంచి 510 మంది హాజరు కానున్నట్లు తెలిపారు. వీరిలో 270 మందికి జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో, 240 మందికి గ్లోబల్ వ్యూ ప్రైవేటు పాఠశాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ పరీక్షలకు సంబంధించి పూర్తి మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్‌కు ఆస్కారం లేకుండా ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జామ్స్ చీఫ్ రామారావు, భోగాపురం ఎంఇఒ రమణమూర్తి, ఎంఇఒ-2 పెంటయ్య, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చెరుకుపల్లి కొండపై మళ్ళీ చదును

- పనులను ప్రారంభించిన ప్రయివేటు వ్యక్తులు
- అడ్డుకున్న గ్రామస్తులు
- పట్టించుకోకపోవడంతో అధికారులపై అనుమానాలు

ప్రజాశక్తి- భోగాపురం

వంద కోట్ల విలువైన చెరుకుపల్లి కొండ వ్యవహారంలో రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రైవేటు వ్యక్తుల పరమై రెండు మూడు రిజిస్ట్రేషన్లు జరిగిన వంద కోట్ల విలువైన 20 ఎకరాల కొండను అప్పటి మహిళా జిల్లా కలెక్టరు రీసర్వేలో యథావిధిగా మళ్ళీ కొండగా మార్చారు. అంతేకాక అప్పటి జాయింట్ కలెక్టర్ కిషోర్ కుమార్‌ను సైతం ప్రభుత్వానికి సరెండర్ చేశారు. అలాంటి భూమిని ఇటీవలి కొందరు ప్రైవేటు వ్యక్తులు వచ్చి యథేచ్ఛగా ఈ కొండపై బ్లేడ్ ట్రాక్టరుతో వెళ్లి రహదారితో పాటు కొండపైన ఉన్న తుప్పలను తొలగింపు పనులు చేపట్టారు. ఇంతలా జరుగుతుంటే గ్రామస్తులు అడ్డుకున్నారే తప్ప రెవెన్యూ అధికారులు కనీసం కన్నెత్తి చూడకపోవడం విశేషం. దీంతో రెవెన్యూ అధికారులకు తెలిసే ఈ చదును పనులు జరిగాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వంద కోట్లు విలువచేసే భూమిని కాపాడే విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వినబడుతున్నాయి.

మండలంలోని చెరుకుపల్లి రెవెన్యూలో సర్వే నెంబరు ఒకటిలో కొండ ఉంది. ఈ కొండ విశాఖ జిల్లాతో పాటు జాతీయ రహదారికి ఆనుకొని ఉంది. దీంతో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు దీనిపై కన్నేశారు. ఈ కొండను అప్పట్లో కొంత మంది జిల్లా నుంచి మండలస్థాయి అధికారులు నలుగురు మాజీ సైనికుల పేరుతో 20 ఎకరాలను జిరాయితీగా మార్చేశారు. అనంతరం వెంటనే ఆ మాజీ సైనికులు వేరే వ్యక్తుల పేరు మీద రిజిస్ట్రేషన్లు చేసేశారు. అక్కడ నుంచి రెండు మూడు రిజిస్ట్రేషన్లు జరిగాయి. కాని మాజీ సైనికుల పేరున కేటాయించేటప్పుడు తప్పనిసరిగా డిఆర్ ఫైలు ఉండాలి. అలాగే కొండపైకి వెళ్ళి సబ్ డివిజన్ కూడా చేయాలి. కానీ అప్పటి అధికారులు మాత్రం గుడ్డిగా చేసేశారు. అయితే ఆ డిఆర్ ఫైలు కావాలని చెరుకుపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు సమాచారం హక్కుచట్టం ద్వారా అడిగారు. రెవెన్యూ అధికారులు డిఆర్ చేయకపోవడం వల్ల తమ దగ్గర లేదని చేతులెత్తేశారు.

రోడ్డు వేసి జిరాయితీగా మార్చి..

కింద నుంచి ఏకంగా కొండపైకి రహదారి వేసి కొండపైన అప్పట్లో లెవెలింగ్ పనులు కూడా చేపట్టారు. అప్పటి జిల్లా కలెక్టరుగా పనిచేసిన హరిజవహరలాల్ హయాంలో కొండను ఏకంగా జిరాయితీ భూమిగా మార్చేశారు. దీంతో ఆయన బదిలీ తరువాత వచ్చిన కలెక్టరు సూర్యకుమారి దీనిపై ప్రత్యేక దృష్టి సారించారు. కొండను జిరాయితీ భూమిగా ఎలా మార్చారంటు విచారణ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మాజీ సైనికులకు కేటాయించారంటు రీసర్వేలో ఈ జిరాయితీ భూమిగా మారిన కొండను ప్రభుత్వ భూమిగా తిరిగి మార్చేశారు. ఎటువంటి లావాదేవీలు జరగకుండా అడ్డుకున్నారు.

ఇప్పుడు మరోసారి తెరపైకి

ప్రభుత్వ భూమిగా మార్చిన తరువాత ఆ కొండను కాపాడాల్సిన బాధ్యత స్థానిక రెవెన్యూ అధికారులకు ఉంది. కానీ స్థానిక అధికారులు మాత్రం సంబంధం లేనట్లుగా వ్యవహరించడంతో మరోసారి కొండను కబ్జాచేసేందుకు కొంత మందికి తెరపైకి వచ్చారు. వారం రోజులు కిందట ఈ కొండపైకి ప్రైవేటు వ్యక్తులు ఒక బ్లేడ్ ట్రాక్టర్‌ను పంపించారు. కొండపైకి వెళ్ళేందుకు వేసిన దారిని చదును చేశారు. అంతేకాక కొండపైకి వెళ్ళి గతంలో చదును చేసిన స్థలంలో పిచ్చి మొక్కలు పెరగడంతో వాటిని తొలగించి మళ్ళీ దర్జాగా చదును చేసుకున్నారు. ఇంతలో ఈ సమాచారం తెలుసుకున్న గ్రామంలోని కొంత మంది పెద్దలు వెళ్ళి అడ్డుకున్నారు. ఎవరి అనుమతితో ఇక్కడకు వచ్చారంటు నిలదీశారు. ఈ స్థలం మీదని అనుమతులు చూపించాలని కోరారు. అనంతరం వెంటనే రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. కానీ అధికారులెవరూ సంబంధిత కొండ వద్దకు రాలేదు. పైగా చదును చేసిన ట్రాక్టరును సైతం వదిలేశారు. ఫలితంగా కబ్జాదారులు, అధికారులు కుమ్మక్కు అయిపోయాన్న అనుమానం గ్రామస్తుల్లో బలం పడింది.

మేమే కొండపైకి వెళ్ళి ట్రాక్టరును అడ్డుకున్నాం

గతంలో ఈ కొండను ప్రభుత్వ భూమిగా అప్పటి కలెక్టరు సూర్యకుమారి మార్చారు. ఇప్పుడు కొంత మంది మళ్ళీ కొండమీదకు ట్రాక్టరును తీసుకొచ్చి చదును చేస్తున్నారు. దీంతో వెంటనే కొండపైకి వెళ్ళి ట్రాక్టరును అడ్డుకున్నాం. అక్కడ నుంచి రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చినా సరే ఎవరు స్పందించలేదు.

సరగడ తోగులురెడ్డి, చెరుకుపల్లి

చదును చేసే పనులను అడ్డుకుంటున్న గ్రామస్తులు

చదును చేసిన వ్యక్తులపై చర్యలు లేవు

కొండను ఏకంగా మాజీ సైనికుల పేరు మీద నిబంధనలకు విరుద్ధంగా కేటాయించారు. తిరిగి మళ్ళీ ప్రభుత్వ భూమిగా మర్చారు. కాని కొంత మంది ప్రైవేటు వ్యక్తులు వచ్చి తమ సొంత భూమిలా పనులు చేస్తుండడంతో అడ్డుకున్నాం. అధికారులు మాత్రం సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోలేదు. ట్రాక్టరును సైతం వదిలేశారు.

గంటా నర్సింగరావు, దళిత నాయకుడు, చెరుకుపల్లి

కొండపై ఎవరకీ అనుమతులివ్వలేదు

చెరుకుపల్లి కొండపై ఎవరకీ ఎటువంటి అనుమతులూ ఇవ్వలేదు. ప్రభుత్వం నుంచి కూడా ఎవరికి కేటాయించినట్లు కూడా ఆదేశాలు లేవు. ఎవరైనా వ్యక్తులు వెళ్ళి పనులు చేస్తే ఇకపై ఖచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

ఎమ్. సురేష్, తహశీల్దారు, భోగాపురం

ప్రయివేట్ ఫిట్‌నెస్ సెంటర్‌ను రద్దుచేయాలి

10న కలెక్టరేట్ వద్ద ధర్నాకు సిఐటియు పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వాహన ఫిట్నెస్,రెన్యువల్ , రిజిస్ట్రేషన్ సేవలను ప్రైవేటీకరిస్తూ గరివిడి మండలం అచ్యుతాపురంలో ఏర్పాటు చేసిన వాహనాల ఫిట్నెస్ ప్రైవేటు ఏజెన్సీ (వేదాంత)ని రద్దు చేసి ఆర్టీవో అధికారుల ద్వారా సేవలందించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న కలెక్టరేట్ వద్ద ధర్నా తలపెట్టినట్లు ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కో కన్వీనర్ ఎ.జగన్మోహన్‌రావు, శ్రీ కనకదుర్గ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు రామునాయుడు తెలిపారు. ఈ ధర్నాలో ఆటో, క్యాబ్, లారీ, వ్యాన్ తదితర మోటార్ ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు విజయనగరంలో గురువారం పలు ప్రాంతాల్లో ప్రచార క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాల రెన్యువల్ ,రిజిస్ట్రేషన్ ,ఫిట్నెస్, లైసెన్స్ వంటి సేవలను ప్రైవేటీకరిస్తే ప్రమాదాలు మరింత పెరుగుతాయని, డ్రైవర్ల పై రెట్టింపు భారాలు పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్ల పై ఈ విధంగా ఆర్థిక దాడికి పాల్పడడం సరి కాదని, తక్షణమే పెంచిన ఫీజులు పెనాల్టీల జీవనం 21న రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రచార కార్యక్రమంలో శ్రీ కనకదుర్గ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు రామునాయుడు, శ్రీను, ఈశ్వరరావు, రాజు, నర్సింగ్, ఆనంద్ , రామారావు, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జగన్మోహన్‌రావు

ప్రయివేటు ఫిటనెస్ ఏజెన్సీని రద్దు చేయాలి

భోగాపురం : వాహనాల ఫిట్నెస్ ప్రైవేటు ఏజెన్సీ (వేదాంత)ని రద్దు చేయాలని కోరుతూ బోగాపురం ఆటో స్టాండ్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో గురువారం పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న కుట్రలో భాగంగా కార్పొరేట్ సంస్థ అయినా వేదాంత అనే స్వచ్ఛంద సంస్థకు వాహనాలు ఫిట్నెస్ కాంట్రాక్ట్‌ను కట్టబెట్టిందని అన్నారు ఈ ప్రైవేటు ఏజెన్సీని రద్దుచేసి దీని నిర్వహణ ప్రభుత్వమే చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10వ తేదీన కలెక్టరేట్ వద్ద జరగబోయే ధర్నా కార్యక్రమంలో రవాణా శాఖ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి సూర్యనారాయణ, ఆటో యూనియన్ నాయకులు వనం రమణ, వద్ద అప్పారావు, మామిడి సంజీవరావు, నక్క శ్రీను తదితరులు పాల్గొన్నారు.

8న లోక్ అదాలత్

ప్రజాశక్తి - బొబ్బిలి

స్థానిక కోర్టులో ఈనెల 8న జాతీయ లోక్ అదాలత్ రెండు బెంచ్‌లలో నిర్వహించనున్నట్లు మండల లీగల్ సెల్ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ చెప్పారు. తనతో పాటు న్యాయవాది కె.శైలజ ఒక బెంచ్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణిరావు, న్యాయవాది పి.జగన్నాథం మరో బెంచ్ నిర్వహించి కేసులను పరిష్కరిస్తారని చెప్పారు.

రాజాం: ఈ నెల 8న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాజాం సీనియర్ సివిల్ జడ్జి కె. శారదాంబ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు లోక్ అదాలతో రాజీకి అనుకూలమైన అన్ని క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, ఫ్రీ లిటిగేషన్ కేసులు, ఇరు పార్టీల అంగీకారంతో పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని కక్షదారులు వినియోగించుకోవాలని కోరారు. లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు పరిష్కారమయితే కోర్టు ఫీజు కూడా వాపస్ ఇస్తారన్నారు.

గ్రామీణ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

గ్రామీణ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించామని సీడాప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె. శ్యామ్ ప్రసాద్ అన్నారు. గురువారం ఇక్కడ జిల్లా స్థాయి జెడిఎం (జాబ్స్ డిస్ట్రిక్ట్ మేనేజర్)లకు ఆయన శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీడాప్ (సొసైటీ ఫర్ ఎంప్లాయ్ మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్ప్రైజెస్ డెవలప్మెంట్) చైర్మన్ జి.దీపక్ రెడ్డి, సిఇఒ పి.నారాయణ స్వామి వర్చువల్ విధానంలో మాట్లాడుతూ రాష్ట్రంలో రానున్న రెండేళ్లలో 30వేల మంది యువతకు ఉపాధి, వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో సీడాప్ పనిచేస్తోందన్నారు. తొలిరోజు శిక్షణ కార్యక్రమంలో సెంచూరియన్ విశ్వవిద్యాలయం విస్తరణ, స్కిల్స్, ఇంక్యుబేషన్ సెంటర్ డీన్ ప్రొఫెసర్ జె.అనీల్ కుమార్ బిజినెస్ మోడళ్ళు, మార్కెటింగ్ లింకేజిలు, బైబ్యాక్ విధానం తదితర అంశాలపై వివరించారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగం, ఆదాయ మార్గాలు గురించి వివరించారు. దినకర్, సుమన్ తదితరులు చేపల పెంపకం, గొర్రెల పెంపకం, మురికి నీరు శుద్ధి, వెనిలా, సాఫ్రాన్, దుస్తుల తయారీ, అరకు కాఫీ, డ్రాగన్ పండ్ల తోటల పెంపకం, పుట్ట గొడుగుల పెంపకం, ఇ-వాహనాలు, వ్యర్థ పదార్థాల నుంచి కుండల తయారీ తదితర రంగాలలో ఆదాయ మార్గాలు, ఇతర అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ మిషన్ మేనేజర్లు టి.అశోక్ కుమార్, రామకృష్ణ, ప్రసాద్, విజయ్ కుమార్, వివిధ జిల్లాలకు చెందిన జాబ్స్ డిస్ట్రిక్ట్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఫార్మసీ విద్యా దినోత్సవం

సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో జాతీయ ఫార్మసీ విద్యా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి మాట్లాడుతూ ఔషధ విద్యకు పునాది వేసిన ప్రొఫెసర్ మహదేవ్ లాల్ ష్రాఫ్ జన్మదినోత్సవాన్ని జాతీయ ఫార్మసీ విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ఈ ఏడాది ఫార్మా, ఫార్మసీ ప్రాక్టీస్‌లో వ్యవస్థాపకత, స్టార్టప్‌లు ప్రోత్సహించడం ప్రధాన అజెండాగా ప్రభుత్వం పేర్కొందన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ, ఫార్మసీ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

జగన్ నోటు దురుసు తగ్గించాలి

జనసేన రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, బాబు పాలూరి

ప్రజాశక్తి- బొబ్బిలి

మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి నోటి దురుసు తగ్గించుకుంటే మంచిదని ప్రజల శ్రేయస్సు కోసం, రాష్ట్ర భవిష్యత్తు కోసం నిత్యం పరితపించే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకోవాలని జనసేన పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి బాబు పాలూరి అన్నారు. ఆయన గురువారం విలేకర్లతో మాట్లడుతూ నోరు అదుపులో పెట్టుకోకపోతే ఇప్పుడు పార్టీ ఉన్న దయనీయమైన పరిస్థితి కంటే మరింత దారుణమైన స్థితికి చేరుకోవాల్సి వస్తుందన్నారు. మీరు అధికారంలో ఉన్నప్పుడు దోపిడీలు, దౌర్జన్యాలపై ఎక్కువ, రాష్ట్ర అభివృద్ధిపై తక్కువ దృష్టి పెట్టారు కాబట్టే ప్రజలు మిమ్మల్ని మీ పార్టీని ఛీ కొట్టి మూల కూర్చోబెట్టారని గుర్తు చేశారు. జగన్ రెడ్డి ప్రతి నాయకుడికి ఎక్కువ, ప్రతిపక్ష నాయకుడికి తక్కువ అని ఎద్దేవా చేశారు. ప్యాలెస్‌లో ఎక్కువ, అసెంబ్లీలో తక్కువ అని విమర్శించారు. ఈ సమావేశంలో ఆ పార్టీ బొబ్బిలి మండల అధ్యక్షులు సంచాన గంగాధర్, మరడాన రవి, శ్రీకాకుళం జిల్లా సంయుక్త కార్యదర్శి జాని, ఉమ్మడి విజయనగరం జిల్లా కార్యదర్శులు గార గౌరీ శంకర్, గంట్యేడ స్వామి నాయుడు, పెంట శంకర్‌రావు, బలిజిపేట మండల అధ్యక్షుడు బంకురు పోలినాయుడు, బొబ్బిలి జనసేన నాయకులు బెవర గణేష్, కనకాల శ్యామ్, చీమల సతీష్, దిబ్బ కళ్యాణ్, చింతాడ అనంత్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుండాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఎంపిపి శంబంగి లక్ష్మి, జెడ్‌పిటిసి ఎస్.శాంతికుమారి అన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో గురువారం మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలు సమక్షంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సాధికారత సాధనకు ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. మహిళలను చైతన్యం చేసేందుకు పని చేస్తున్నామని ఐసిడిఎస్ పిఒ విజయలక్ష్మి అన్నారు. అనంతరం ఎంపిపి, జెడ్‌పిటిసి, ఐసిడిఎస్ పిఒ, మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం పక్కి భాగ్యలక్ష్మి, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: మండలంలోని పెరుమాలి అంగన్‌వాడీ కేంద్రంలో పెరుమాలి సెక్టార్, తెర్లాం సెక్టార్ అంగన్వాడీ కార్యకర్తలు గురువారం ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

సిడిపిఒను సత్కరిస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి

ఎంపిడిఒ రాంబాబు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి చెందుతున్నారని ఏ విషయంలో మహిళలు ఎవరికంటే తక్కువ కాదని గుర్తు చేశారు. అంగన్‌వాడీల్లో ఇస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హేమలత, ఐసిడిఎస్ పిఒ రాజ్యలక్ష్మి, సూపర్‌వైజరు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'రోడ్డు నిర్మాణానికి వ్యతిరేకం కాదు'

ప్రజాశక్తి- శృంగవరపుకోట

రోడ్డు విస్తరణకు తామేమి వ్యతిరేకం కాదని నష్టపోతున్న భూములకు ఐదు రెట్లు పరిహారాన్ని పెంచాలని బైపాస్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు రెవెన్యూ అధికారులను వేడుకొన్నారు. పెందుర్తి నుండి బొడ్డవర వరకు నాలుగు లైన్లుగా విస్తరించబోతున్న 516 జాతీయ రహదారి విస్తరణ కోసం భూములు కోల్పోతున్న రైతులతో పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో డిప్యూటీ తహశీల్దార్ భరత్ కుమార్ అధ్యక్షతన గురువారం అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి హాజరైన ల్యాండ్ ఎక్కువేషన్ డిడి హరికిరణ్ మాట్లాడుతూ రహదారి విస్తరణలో భాగంగా ప్రభుత్వం భూములను ఐదు కేటగిరీలుగా గుర్తించి వాటికి రేట్లను నిర్ణయించిందన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న భూములు కన్వర్షన్ చేయకుండా గజాలలో మార్పు చేసి ఉంటే వాటికి గజాలలో నష్టపరిహారం రాదని సెంట్లలో పరిహారం వస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా రైతులు పిల్లల రమణ, పరమరశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ ఇప్పటికే పోలవరం కాలువ నిర్మాణానికంటూ భూసేకరణ చేశారని ఆ వెంటనే జాతీయ రహదారి విస్తరణలో భాగంగా బైపాస్ రోడ్డు నిర్మాణానికి భూములు సర్వే చేస్తున్నారని ఆ భూములు ఆధారంగా బతుకుతున్న తమకు దెబ్బ మీద దెబ్బ తగులుతుందని అన్నారు. అయినప్పటికీ అభివృద్ధికి ఆటంకం కాకూడదనే భూములు ఇస్తున్నామని 2013 భూ సేకరణ చట్టం ప్రకారం సుప్రీం కోర్టు గైడ్లెన్స్ ప్రకారం భూసేకరణకు నష్టపరిహారం ఇవ్వాలని, ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తామన్న ఒకటిన్నర రెట్లు నష్టపరిహారం చాలా తక్కువని చెప్పారు. మార్కెట్ విలువకు ఐదు రెట్లు పెంచి ఇవ్వాలని కోరుతున్నామన్నారు. ఈ సమావేశంలో రైతులు, విఆర్ఒలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఐదు రెట్లు ధర కల్పించాలని వేడుకుంటున్న రైతు

ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

గర్భాం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- మెరక ముడిదాం

భారతీయ విజ్ఞాన శాంకేతిక మండలి ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న ఇన్‌స్పైయిర్ కంపిటేషన్స్ 2024-2025లో మండలంలోని గర్భాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న పళ్లెడ భార్గవ్, తొమ్మిదవ తరగతి చదువుతున్న మంత్రి ప్రియవర్షిణి, కర్రీ విగ్నేశ్వరి ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎస్ఎస్ఆర్ ఆచార్యులు తెలిపారు. ఆయన పాఠశాల విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయులను అభినంది ంచారు. భారతీయ విజ్ఞాన మండలి నుంచి ప్రాజెక్ట్ డెవలప్ మెంట్ నిమిత్తం ఒక్కొక్క విద్యార్థికి పదివేల రూపాయలు ప్రైజ్ మనీ అందుతున్నట్లు హెచ్‌ఎం చెప్పారు.

గంజాయితో ఇద్దరు పట్టివేత

ప్రజాశక్తి - నెల్లిమర్ల

గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ బి. గణేష్ తెలిపారు. గురువారం పట్టణంలో చంపావతి నది తీరంలో థామస్‌పేట గ్రౌండ్ వద్ద అక్రమంగా గంజాయిని ఒరిస్సాలోని రాయగడ నుంచి నెల్లిమర్ల పట్టణానికి తరలిస్తున్న రాయగడకు చెందిన ఈశ్వర్ మీనియాక, దానిని కొనుగోలు చేసిన నెల్లిమర్ల డైట్ కాలనీకి చెందిన సిరిగిడి మనోహర్‌ను పట్టుకొని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నెల్లిమర్లకు చెందిన వ్యక్తి చిన్నచిన్న ప్యాకెట్ల రూపంలో గంజాయిని కాల్చే అలవాటున్న వినియోగదారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. కాగా వీరిద్దరి నుంచి సుమారు ఒక కేజీ 160 గ్రాములు గంజాయిని సీజ్ చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. సిరిగిడి మనోహర్ ఇంతకుముందు ఒక గంజాయి కేసులో నిందితుడిగా ఉన్నాడని ఎస్ఐ తెలిపారు.

600 కిలోల రేషన్ బియ్యం సీజ్

ప్రజాశక్తి-బొబ్బిలి

మండలంలోని దిబ్బగుడివలసలో గురువారం సాయంత్రం 600 కిలోల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. పిరిడి గ్రామానికి చెందిన వ్యాపారి ఆర్.శ్రీనివాసరావు బియ్యాన్ని ఆటోలో తరలిస్తున్నట్లు విజిలెన్స్ అధికారులకు సమాచారం రావడంతో సిఐ సతీష్ కుమార్, సిబ్బంది కలిసి సి.ఎస్.డి.టి సాయికృష్ణ సమక్షంలో ఆటో, 6 బస్తాలతో రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అధికారులు హెచ్చరించారు.

క్రాష్ ప్రోగ్రామ్ ప్రారంభం

ప్రజాశక్తి- భోగాపురం

మండలంలో తాగునీటి సమస్యలు పరిష్కారానికే క్రాస్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కె.గాయత్రి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద క్రాష్ ప్రోగ్రాం వాహనాన్ని గురువారం ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మరమ్మతులు గురైన బోర్లను ఈ ప్రోగ్రాం ద్వారా బాగు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సలహాదారు ఉప్పాడ సూర్యానారాయణ రెడ్డి, సుందర హరీష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ అలేఖ్య, బోర్ మెకానిక్‌లు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని ఎంపిడిఒ ఆర్.రాంబాబు తెలిపారు. మండలంలో ఎక్కడైనా బోరు బావులు మరమ్మతులకు గురైతే వెంటనే ఫోను నెంబర్లకు 8332908770, 9949337492, 9963616062 ఫిర్యాదు చేస్తే 24 గంటలలో మరమ్మత్తులు చేపడతామని ఆయన తెలిపారు. సచివా లయ అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలని గ్రామాల్లో ఏ విధమైన ఇబ్బంది కలిగిన ప్రజలు ఇచ్చే ఫిర్యాదును స్వీకరించి తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశించామన్నారు.

మంచి నీటి కొరత లేకుండా చర్యలు

మెరక ముడిదాం: సమ్మర్ క్రాష్ ప్రోగ్రాంలో భాగంగా గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా చర్యలు చేపడుతున్నామని ఎంపిడిఒ జి. భాస్కరావు తెలిపారు. ఏ గ్రామంలో తాగునీటి సమస్య ఉన్నా వెంటనే తమకు తెలియజేయాలని చెప్పారు. అనంతరం బైరిపురం తాగు నీటి బోరు మరమ్మతుకు గురికావడంతో ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది స్పందించి బాగుచేసినట్లు ఆయన తెలిపారు.